క్లుప్తంగా

ఓటు హక్కు కల్పించండి

• ఆర్డీవో మధుసూదన్



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన వయోజనులకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వేములవాడ ఆర్డీవో మధుసూదన్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో అఖిలపక్ష నేతల గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు అర్హులైన ఓటర్లు నమోదయ్యేలా, తమ వంతుగా కృషి చేయాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అందరూ సహకరించాలని, చనిపోయిన వారిపేర్లు తొలగించాలన్నారు. ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆర్డీవో కార్యాలయంలో అఖిలపక్ష నేతల సమావేశం ఉంటుందని, తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

మీ కోసం పోలీసులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ముస్తాబాద్: ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తున్నారని మండలంలోని గన్నెవారిపల్లెలో ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని అందజేయాలని కోరారు. ఏదైనా ఆపద వచ్చిన కొత్తగా గ్రామాల్లోకి ఎవరైన వచ్చిన 100 డయల్ చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని సూచించారు. బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసే వ్యక్తులకు వివరాలను చెప్పవద్దన్నారు. సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చందుర్తి: గడ్డి కట్టింగ్ మిషన్‌లో పడి చేయి కోల్పోయిన చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన ఉగిలె జలేందర్‌కు ఆయనతో కలిసి చదువుకున్న లయోలా పాఠశాల విద్యార్థులు రూ.50 వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమణ చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబరి కల్పన, పూర్వ విద్యార్థులు అంబరి నరేశ్, మహేశ్, మహేందర్, ప్రమోద్, ఉగిలే మధు, సురేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంటింటా రాఖీ పండుగ



చందుర్తిలో రక్షాబంధన్ వేడుకలు



సోదరులకు రాఖీ కట్టి హెల్మెట్‌లు బహూకరిస్తున్న సోదరి



ఇల్లంతకుంట: జెడ్పీవైస్ చైర్మన్‌కు రాఖీ కడుతున్న సోదరి



వేములవాడ: సోదరుడికి చిన్నారుల మంగళహారతి



ముస్తాబాద్‌లో సోదరులకు రాఖీ కడుతున్న సోదరి



చందుర్తి ఎస్సైకి రాఖీ కడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ



ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ కార్యాలయంలో..



వేములవాడఅర్బన్: రాఖీ కడుతున్న విద్యార్థినులు

రాఖీ పండుగను జిల్లాలో గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అక్కా చెల్లెళ్లు, తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించుకున్నారు. తోబుట్టువులు తమ స్వగ్రామాలకు వచ్చి సోదరులకు రాఖీలు కట్టారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారికి రాఖీలు పంపి ఆ ప్రేమానుబంధాలను పంచుకున్నారు. ప్రతీ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. వేకువజామునే ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుపగా భక్తులు బారులు తీరి దర్శనాలు చేసుకున్నారు. పట్టణంలో రాఖీలు కొనేందుకు బారులు తీరారు. పలు పాఠశాలల్లో రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్

ఘనంగా నూలు పౌర్ణమి

• సామూహిక యజ్ఞోపవీతధారణలు • మరోవైపు మార్కండేయస్వామి శోభాయాత్రలు



రుద్రంగి: శోభాయాత్రలో పద్మశాలి సంఘం సభ్యులు



కోనరావుపేట: నిమ్మపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న పద్మశాలీలు



వేములవాడ: నూలు పౌర్ణమిని జరుపుకుంటున్న పద్మశాలీలు

జిల్లాలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం నూలు పౌర్ణమి నిర్వహించారు. గాయత్రి మాతకు పూజలు చేసి, సామూహిక యజ్ఞోపవీతాలను ధరించారు. తంగళ్లపల్లి, బోయినపల్లి మండల కేంద్రంలోని విలాసాగర్ కొత్తపేట, రుద్రంగిలో మార్కండేయ స్వామి శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. - వేములవాడ/తంగళ్లపల్లి/వేములవాడఅర్బన్/రుద్రంగి/కోనరావుపేట





బోయినపల్లి, తంగళ్లపల్లిలో సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమంలో పద్మశాలీలు

అనాథకు అక్కగా..



పారిశుధ్య కార్మికుడికి రాఖీ కడుతున్న రేణుక

ఎల్లారెడ్డిపేట: నా అనేవారు లేక అనాథకు ఓ మహిళ అక్కగా మారి రాఖీ కట్టింది. పండుగ వేళ తోబుట్టువులు లేరని మనస్తాపంతో ఉన్న పారిశుద్ధ్య కార్మికుడికి రాఖీ కట్టి బంధం కలిపింది. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన పంచాయతీ కార్మికుడు కేసనపల్లి బాబుకు తల్లిదండ్రులు అతని చిన్నతనంలోనే మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కొండ రేణుక గురువారం రాఖీ కట్టింది. తల్లిదండ్రులు లేని ఆ కార్మికుడికి ఓ అక్కగా రాఖీ కట్టానని, అందుకు రక్త సంబంధం అవసరం లేదని ఆమె అన్నారు.

పండుటాకులకు..



వృద్ధాశ్రమంలో రాఖీ పండుగ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వృద్ధులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించుకున్నారు.

యాచకులకు..



రాఖీ కట్టుకుంటున్న యాచకులు

వేములవాడ: నా అన్నవాళ్లెవ్వరూ లేక రాజన్ననే దిక్కనుకుని వేములవాడలో ఆశ్రయం పొందుతున్న యాచకుల్లో సంతోషం నింపేందుకు మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు గురువారం రాఖీ పండుగ నిర్వహించారు. వారికి మహిళలతో రాఖీలు కట్టించడంతో కన్నీటిపర్యంతమయ్యారు. అలాగే గురువారం సైతం 150 మందికి అన్నదానం నిర్వహించినట్లు ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, చల్లా సత్తయ్య, ప్రతాప నటరాజ్, పాలాస రాజేందర్, కొప్పుల హనుమండ్లు, నంది సాయికుమార్ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో పని చేసి గురువారం ఉద్యోగ విరమణ పొందిన నమిలకొండ వేణు, కుమ్మరి బాబును ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేణు, కుమ్మరిబాబు దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నత్తనడకన 'బడి' పనులు

• 15 మాసాలు గడిచినా పూర్తికాని తీరు
• మెయింటెనెన్స్ పనుల్లో లోపించిన నాణ్యత ప్రమాణాలు
• తరగతి గదులు లేక ఇబ్బంది



బండపల్లిలో ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా మిగిలిన తరగతి గది

చందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన మన ఊరు.. మన బడి కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం మూలంగా నీరుగారిపోతోంది. మొదటి విడతగా చందుర్తి మండలంలోని 15 పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అదనపు తరగతి గదులు నిర్మాణానికి రూ.2.14 కోట్లను కేటాయించింది. ఆరు మాసాలలోపు పనులు పూర్తిచేయాలని ఆదేశాలున్నా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా 15 మాసాలైనా 50 శాతం కూడా పూర్తి కాలేదు. పనులను పూర్తి చేయించాల్సిన ప్రజాప్రతినిధులు కొందరు బినామీ పేర్లపై, కొందరు తమ అనుచరులకు పనులను అప్పగించడంతో అధికారులు సైతం వారిని ప్రశ్నించలేక పనుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లాభసాటి పనులపై ఆసక్తి

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే లాభసాటి పనులపై కాంట్రాక్టర్లు ఆసక్తి కనబర్చారు. పాఠశాలల్లో ముందుస్తుగా విద్యుద్ధీకరణ, మెయింటనెన్స్ పనులను ఎప్పుడో ఏడాది క్రితమే పూర్తి చేశారు. మిగతా పనులను పూర్తి చేసే విషయంలో తాత్సారం చేస్తున్నారు. 15 పాఠశాలల్లో విద్యుద్ధీకరణ పనుల కోసం రూ.35.39 లక్షలు కేటాయించారు. దీంతో కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో ప్రయోజనాన్ని ఆశించి ఈ పనులను పూర్తి చేయించారు. 15 పాఠశాలల్లో జోగాపూర్, రామరావుపల్లె, మల్యాల పాఠశాలలు మినహా మిగతా పాఠశాలల్లో పనులు పూర్తి చేయించాల్సి ఉంది. లింగంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్లాబ్ పనులు ఇప్పుడిప్పుడు పూర్తి కావస్తున్నాయి.

మెయింటెనెన్స్ పనులు పూర్తి

మైనర్, మేజర్ మెయింటనెన్స్ పనులపై కాంట్రాక్టర్లు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వీటిలో ఆశించిన దానికంటే ఎక్కువగా వెనకేసుకోవచ్చునన్న ఆశతో వీటని పూర్తి చేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ బిల్లులతో వచ్చిన డబ్బులను మిగతా పనులను పెట్టుబడికి వినియోగించుకోవచ్చనే ఆలోచనతో వీటికి ప్రాధాన్యతను ఇచ్చినట్లు తెలుస్తోంది. వీటి కోసం రూ.24.03 లక్షలు కేటాయించగా, ఈ పనులే అధికంగా పూర్తిచేసినా, నాణ్యత కొరవడినట్లు ఆరోపణలున్నాయి.

పెండింగ్‌లో పనులు

ప్రహరీ, డ్రింకింగ్ వాటర్, అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ పనులు పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. మరో నెల, రెండు నెలలలోపు పనులు పూర్తిచేయిస్తామని అధికారులు చెబుతున్నారు.

అధికారుల తప్పిదం



బండపల్లి పాఠశాలకు జమ కావాల్సిన నిధులు బద్దనపల్లి పాఠశాలలకు జమ చేశారు. దీంతో బిల్లుల చెల్లింపులో జాప్యంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ఇబ్బంది పడి ఆలస్యమైంది. అధికారుల తప్పిదంతోనే తమ పనులు పూర్తి కాలేదు.

– అంబాల దాసు, ఎంపీపీఎస్, ఎస్ఎంసీ చైర్మన్, బండపల్లి

పూర్తయ్యే దశలో ఉన్నాయి



అన్ని పాఠశాలల్లో పనులు పూర్తవుతున్నాయి. చిన్న పనుల్లో జాప్యం అవుతోంది. వీటిని నెలలోపు పూర్తి చేసేలా ఒత్తిడి తీసుకువస్తున్నాం. నాణ్యతను ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలు పరిశీలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తే బిల్లు చెల్లించమని చెబుతున్నాం.

– వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ, చందుర్తి

పొన్నం నియామకంపై హర్షం



పొన్నంను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సార్వత్రిక ఎన్నికల్లో బీసీ డిక్లరేషన్ చైర్మన్‌గా నియామకమైన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మండల కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించిన పొన్నంకు అధిష్టానం బీసీ డిక్లరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడం శుభపరిణామమన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు రవి, రఫీక్, రాజునాయక్, దొమ్మాటి నర్సయ్య పాల్గొన్నారు.

చెన్నమనేని రాజేశ్వర్‌రావుకు నివాళి



నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి: మాజీ శాసనసభ్యులు, దివంగత చెన్నమనేని రాజేశ్వర్‌రావు శత జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడి అభినందన



ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న చంద్రశేఖర్‌రావు

ముస్తాబాద్: పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకం అయిన అక్కరాజు శ్రీనివాస్‌ను టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు గురువారం అభినందించారు. రైతులకు మరిన్ని మెరుగైన సేవలను అందించాలని చంద్రశేఖర్‌రావు కోరారు. ఏఎంసీ నూతన కమిటీని ఆయన అభినందించారు.

ఎంపీటీసీ భర్త మృతి

కోనరావుపేట: మండలం కనగర్తి గ్రామ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకురాలు లింగంపెల్లి లక్ష్మి భర్త లింగయ్య గురువారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంట్లోనే చికిత్స పొందుతూ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను సింగిల్‌విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, సర్పంచ్ భారతి, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

పర్యావరణ పరిరక్షణలో నేను సైతం



కాగితాలతో రాఖీలు తయారు చేస్తున్న బ్లెస్సీ

కోనరావుపేట: మండలం సుద్దాల గ్రామానికి చెందిన డాక్టర్ ప్రకృతి ప్రకాశ్ పదేళ్ల కూతురు బ్లెస్సీ నాంపెల్లిలోని నిర్మల స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. తండ్రి ప్రకాశ్ ప్రకృతి ప్రేమికుడు. రాఖీ పండుగ సందర్భంగా కలర్ కాగితాలతో 105 రాఖీలను తయారుచేసి, హరితహారంలో రోడ్డుకిరువైపులా నాటిన చెట్లకు కట్టింది. చెట్లు ప్రాణం ఉన్నంతవరకు ప్రాణవాయువును మనల్ని కాపాడుతున్నాయన్నారు. చెట్లు కూడా సోదరుల వంటివని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.